# ఫాక్షనిజం ప్రశ్నావళికి మరో అయిదు ప్రశ్నలు

**'స్వచ్ఛమైన పాలన' అందిస్తానంటున్న చంద్రబాబు తన పార్టీలోని ఫాక్షనిస్టులను బయటకు పంపించేస్తే అప్పుడు ప్రజల ఒత్తిడికి కాంగ్రెస్ కూడా అదే పని చేయకతప్పదు. దానితో సమస్య సగం పరిష్కారం అవుతుంది. మిగిలిన సగానికి ప్రభుత్వం చేయగలిగిందేమీలేదు. అది రాయలసీమ సామాజిక జీవిత సంస్కరణ ద్వారా జరగగలదు.**



కె. బాలగోపాల్

స్వచ్ఛమైన పాలన అందించే పేరు మీద చంద్రబాబు నాయుడు ఆడిస్తున్న నాటకానికి సరికొత్త ఉదాహరణ రాయలసీమ జిల్లాలలో ఫాక్షనిజం గురించి ప్రభుత్వం చాలా అమాయకంగా ప్రజలకందిస్తున్న ప్రశ్నావళి.

విజన్ –2020 వెలుగులో స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన కోసం శాంతి –సామరస్యాలు నెలకొల్పే లక్ష్యంతో 'ఫాక్షనిజం మరియు రౌడీయిజం' పైన ఒక ప్రశ్నావళిని కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలలో ప్రభుత్వం ప్రజలకందించి వారి అభిప్రాయాలూ, సూచనలూ కోరుతున్నది. కర్నూలులో ఇప్పటికే ఈ 'అభిప్రాయ సేకరణ' మొదలయింది.

ఇందులో 36 ప్రశ్నలున్నాయి. వాటిని చదివిన వారెవ్వరైనా ప్రభుత్వం ఆవేదనకు ముగ్ధులు కాకతప్పదు. ఎక్కడో పుట్టి ఏ మురికీ అంటని పెద్ద మనిషి ఎవడో అకస్మాత్తుగా రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిపోయి, ఈ జిల్లాలలోని ముఠా కక్షల వాతావరణాన్ని గురించి మొట్టమొదటిసారి విని ఆశ్చర్యపోయి దీనినెట్లాగయినా అంతమొందించాలన్న సంకల్పంతో సలహాల కోసం ప్రజల దగ్గరకు పోతున్నాడని అనుకోకతప్పదు. ప్రజలు వోట్లు వేసి ఎన్నుకున్న తరువాత 'నా ఇష్టమొచ్చినట్టు నేను పరిపాలిస్తా' నని దబాయించకుండా సమస్యల పరిష్కారానికి మళ్ళీ ప్రజల సలహాలే కోరి దాని ప్రకారం నడుచుకోవడం ఎంత గొప్ప సంస్కారం ! అని ముచ్చటపడక తప్పదు.

బయటి రాష్ట్రాలలోనూ, బయటి దేశాలలోనూ తన గురించి తాను ఈ రకమైన ప్రచారమే చేసుకుని ఒక వెలుగు వెలుగుతున్నారు చంద్రబాబు. ఈ రాష్ట్రంలో కూడా ఆయన చిత్తశుద్ధితో ఏదో ప్రయత్నం చేస్తున్నారని నమ్ముతున్న వారు చాలా మంది ఉన్నారు. ఆ నమ్మకం కలగడానికి ఆయన రాజకీయ చరిత్రలో ఎక్కడా ఆధారం లేకున్నా నమ్ముతున్నారు.

కర్నూలు జిల్లాలో తెలుగుదేశం టిక్కెట్ మీద ఈసారి గెలిచిన ఇద్దరు ఎం. పి. లూ ఫాక్షనిస్టులే. ఫాక్షనిస్టులు కాబట్టే ఎట్లాగయినా గెలవగలుగుతారన్న నమ్మకంతో చంద్రబాబు నాయుడు వాళ్ళకు టిక్కెట్లిచ్చారు. వాళ్ళు గెలిచి చూపించారు. అసెంబ్లీకి ఆ జిల్లాలో తెలుగుదేశం టిక్కెట్ మీద గెలిచిన వారిలో నలుగురు (నందికొట్కూరు, ఆత్మకూరు, కర్నూలు, పాణ్యం ఎం. ఎల్. ఏ. లు) ఫాక్షనిస్టులే. ఆళ్ళగడ్డ, పత్తికొండ ఎం. ఎల్. ఏ. లు కూడా ఫాక్షనిస్టు కుటుంబానికి చెందిన వారే. వీరందరూ ఫాక్షన్ బలంతో గెలిచినవారే. గెలుస్తారన్న నమ్మకంతో చంద్రబాబు టిక్కెట్ ఇచ్చిన వారే.

ఇంతచేసి ఇప్పుడు అమాయకంగా మీ గ్రామంలో ముఠా కక్షలున్నాయా ? ముఠా నాయకులను ప్రజలు సమర్థిస్తారా ? ముఠా కక్షలకు గ్రామాధిపత్యం కారణమా ? కుటుంబ తగాదాలు కారణమా ? ఆర్థిక అసమానతలు కారణమా ? రాజకీయ పలుకుబడి, పదవుల కోసం ముఠా కక్షలు ప్రబలుతున్నాయా ? అంటూ ఆవేదనతో కూడిన కుతూహలం నిండిన 36 ప్రశ్నలు ప్రజల ముందుంచి –శాంతి సామరస్యాల స్థాపనకు పది సూచనలిమ్మని అడుగుతున్నారంటే ప్రజలు బేవకూఫ్‌లన్న అభిప్రాయం చంద్రబాబులో ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది.

ఇదొక నాటకమని అందరికీ తెలుసునని ఆయనకు తెలుసు. కానీ ఇది 'నాటకం' అని ఎదురు తిరిగి ప్రజలెవ్వరూ అనరని ధీమా. అందువల్ల ఆయన అక్కడితో ఆగిపోరు. ఫ్యాక్టరీలు మూసేసినన్ని మూసేసి నిరుద్యోగానికి గల మూడు ముఖ్య కారణాలు చెప్పమంటూ ముప్పై ప్రశ్నల పత్రాన్ని ప్రజలలో చర్చకు పెట్టి ఉపాధి కల్పనకు పది సూచనలిమ్మని ప్రజలను అభ్యర్థించగలడు. 'ఆహా! ప్రజల వద్దకు పాలన అంటే ఇది కదా!' అని విదేశాలలో అనిపించుకోగలరు. ప్రజల కనీస అవసరాల కల్పనను ప్రైవేటీకరించేసి పేదరికానికి గల పది ప్రధాన కారణాలు చెప్పమంటూ పాతిక ప్రశ్నల పత్రాన్ని ప్రజలలో చర్చకు పెట్టి పేదరికం నిర్మూలనకు పదో పన్నెండో సూచనలిమ్మని ప్రజలను కోరగలరు. 'ఓహో! ప్రజా పాలన అంటే ఇదే కదా!' అని ఇంకొక్కసారి విదేశాలలో అనిపించుకోగలరు.



ఇన్ని దశాబ్దాలుగా అనేక రూపాలలో, అనేక సిద్ధాంతాలతో సాగుతున్న ప్రజా ఉద్యమాలు ఈ నాటకాన్ని నాటకం అనగల ప్రజలను తగు సంఖ్యలో తయారు చేయలేకపోవడం చాలా బాధాకరమైన విషయం.

పోనీ ప్రజలు అనలేకపోవడానికి వాళ్ళ భయాలో, బాధలో వాళ్ళకున్నాయనుకుందాం.

కానీ అంతటి దుర్గతి లేని విద్యావంతులు సహితం అనలేకపోవడాన్ని ఏమనాలి? వెన్నెముక పోగొట్టుకున్న ఈ జాతి మీద ఎక్కి ఆయన అత్యాధునిక భావాలు గల గొప్ప సంస్కర్తగా చలామణి కాగలుగుతున్నారంటే ఈ జాతికి చెందిన మేధావుల తోడ్పాటు ఉండబట్టే కదా.

తన స్వంత జిల్లాలో –అందులోనూ తన స్వంత నియోజకవర్గంలోనూ తాను పోటీ చేసి గెలుస్తున్న నియోజకవర్గంలోనూ –విస్తృతంగా అమలులో ఉన్న అంటరానితనం, కులవివక్ష ఆయన 'ఆధునికత'కు అడ్డం రాలేదు. రాయలసీమ జిల్లాలలో వోట్లు దండిగా వేయించుకోగల ముఠా నాయకులను చేరదీసి టిక్కెట్లిచ్చి ఆపైన మంత్రి పదవులు కూడా కట్టబెట్టే రాజకీయ ఎత్తుగడలు అడ్డంరాలేదు. పోలీసుల చేతికి విచ్చలవిడి అధికారాలిచ్చి ఏ నాగరిక సమాజమూ ఒప్పుకోని చిత్రహింసలూ, హత్యలూ చేయించే 'శాంతి భద్రతల' వ్యూహం అడ్డంరాలేదు. చట్టం ముందు అందరూ సమానం కావచ్చును కానీ కోడెల శివప్రసాదరావు మాత్రంకాదని ఒప్పుకున్న చేవచచ్చిన చట్టబద్ధపాలన అడ్డం రాలేదు.

దీనిని సాగనిస్తున్నందుకు మనం సిగ్గుపడాలి. ఈ విషయం ఎవరికీ అర్థం కాకుండా పోలేదు కానీ చంద్రబాబు ఎరచూపిస్తున్న 'ఆధునికత' తళుకులు కళ్ళను కప్పేస్తున్నాయి.

ఇది 'పెట్టుబడి' కి సాధారణంగా ఉండే లక్షణం. అది చూపించే ఆకర్షణలో న్యాయాన్యాయాలు కనిపించవు. అవకాశం ఉన్నవాళ్ళు ఏదో ఒక ప్రయోజనం పొందగలరు కాబట్టి లేనివాళ్ళ గురించి ఆలోచించే సానుభూతి నాశనం అవుతుంది.

రాష్ట్రంలోకి 30 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి తీసుకుని వచ్చి దీనినొక 'ఆసియా పులి' గా మార్చి నాలుగు శాతం పెరుగుదలను పది శాతానికి పెంచుతానన్న చంద్రబాబు హామీ్ఘమన కళ్ళను జిగేలుమనిపిస్తున్నది. మధ్య తరగతి కళ్ళకు అద్దాల మేడలు, బంజారాహిల్స్‌లో ప్లాట్లు, అప్పుడే మార్కెట్లోకొచ్చిన కొత్త కొత్త విదేశీకార్లు కనిపిస్తున్నాయి. ఐ. టి. (ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ) రంగంలో ఉద్యోగాలు సంపాదించుకుంటే చాలు చంద్రబాబు తీసుకు రాబోయే భోగాలు మనవేననుకుంటున్నారు. విద్యారంగంలో ఉండే వాళ్ళకు ఆ ప్రయాస కూడా లేకుండా జీతాలు విపరీతంగా పెంచారు. దానిని ఖర్చుపెట్టుకునే మార్గాల గురించి ఆలోచించడంతోనే కాలేజీ పంతుళ్ళ సమయం గడిచిపోతున్నది. నిజానికి వారిలో మెజారిటీ అతి తక్కువ జీతాలకు ప్రైవేట్ కాలేజీలలో చదువు చెపుతున్నారు. కానీ వారి చూపులు కొత్త స్కేల్స్ పొందిన తమ తోటి అధ్యాపకుల మీద ఉన్నాయి. ఆ స్థితిని పొందే మార్గాల మీద ఉన్నాయి.

[illegible]. దానిని ఆధారం చేసుకున్న ఉద్యోగాలు పొందే యోగ్యత లేని వారికి సహితం కాంట్రాక్టుల ఎర చూపిస్తుంది చంద్రబాబు 'అభివృద్ధి'. విదేశీ పెట్టుబడిని లక్షల కోట్ల మోతాదులో ఆహ్వానిస్తూ దానికి అవసరమైన 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ను భారీగా అభివృద్ధి చేయాలన్నది 'విజన్ – 2020' లక్ష్యాలలో ముఖ్యమైనది. అది కాంట్రాక్టర్లకు స్వర్గలోకం లాంటిది.

ఈ రకంగా ధనిక వర్గాన్నే కాక మధ్య తరగతికి చెందిన అన్ని సెక్షన్లనూ మైమరపింపజేసే అభివృద్ధి నమూనాను ప్రయోగించి తననూ తన విధానాలనూ విమర్శించగల వారి కళ్ళు కప్పేయడంలో చంద్రబాబు కృతకృత్యుడయ్యారనే చెప్పుకోవచ్చు. అందువల్ల స్వచ్ఛమైన పాలన పేరు మీద, ప్రజల వద్దకు పాలన పేరు మీద ఎన్ని నాటకాలయినా ఆడి సాగించుకోగలుగుతున్నారు.

రాయలసీమ ఫాక్షన్ల విషయానికి తిరిగొస్తే, నిజంగా వాటిని అరికట్టదలచుకున్నట్టయితే వాటిని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి తీసుకునివచ్చిన గడచిన రెండు దశాబ్దాల రాజకీయ నీతిని తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు రెండు విడనాడాలి. వీరి పేరు చెప్పి వారూ వారి పేరు చెప్పి వీరూ ఈ ఘోరాన్ని కొనసాగిస్తున్నారు. ఎవరు ముందు మానుకుంటారనేది ప్రజలకనవసరం. ఇద్దరూ మానుకోవాలి. అక్కడితో ముఠా కక్షల సమస్య మొత్తంగా అంతమయిపోదుగానీ అదుపులోకి వస్తుంది. ఆపైన దానిని పూర్తిగా రూపుమాపడానికి అవసరమైన చర్యల గురించి కొంచెం తీరికగానే ఆలోచించుకోవచ్చు.

కానీ చంద్రబాబు ప్రభుత్వం రాయలసీమ ప్రజలకు పంచుతున్న 36 ఈ ప్రశ్నలలో ఈ ప్రశ్నలు మాత్రం లేవు. వాటిని చేరిస్తే తప్ప ఆ ప్రశ్నావళి పూర్తి కాదు.

గ్రామ ముఠా కక్షలను జిల్లా, రాష్ట్ర రాజకీయాలలోకి తీసుకుని రావడంలో ప్రధాన బాధ్యత కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలదేనని మీరు నమ్ముతున్నారా ?

తమ రాజకీయ లబ్ధి కోసం ఈ రెండు పార్టీలూ గ్రామం నుంచి జిల్లాదాకా ఫాక్షన్లను పెంచి పోషిస్తున్నాయని మీరు నమ్ముతున్నారా ?

ఫ్యాక్షన్ల బలం ఉన్న అభ్యర్థులకే ఎన్నికలలో టిక్కెట్లు ఇవ్వడం ద్వారా ఈ రెండు పార్టీలూ రాజకీయాలను ఫాక్షన్లమయం చేశాయని మీరు అనుకుంటున్నారా?

స్వచ్ఛమైన పాలన, నేరరహిత రాజకీయాలు, శాంతి సామరస్యాలూ అంటూ మాట్లాడే చంద్రబాబు నిన్న మొన్నటి ఎన్నికలలో మెజారిటీ నియోజకవర్గాలలో ఫాక్షనిస్టులకే టిక్కెట్లిచ్చారని మీరు భావిస్తున్నారా?

తమ రాజకీయ లబ్ధికోసం చేరదీసిన ఈ ముఠా నాయకులు ప్రత్యర్థులకు దీటుగా నిలబడడం కోసం కాంట్రాక్టులలోనూ, వ్యాపారాలలోనూ ఎన్ని దౌర్జన్యాలకు పాల్పడినా తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాలు చూసీ చూడనట్లు ఉంటున్నాయని మీరు భావిస్తున్నారా?

చంద్రబాబు ప్రశ్నావళిలో ఈ ప్రశ్నలు కూడా చేర్చి, అప్పుడు ఫాక్షనిజం సమస్య పరిష్కారానికి సూచనలిమ్మని ప్రజలనడిగినట్టయితే పది సూచనలిమ్మని కోరనక్కరలేదు. ఒక్క సూచన చాలు, సమస్యను కనీసం సగభాగం పరిష్కరించడానికి. 'స్వచ్ఛమైన పాలన' అందిస్తానంటున్న చంద్రబాబు తన పార్టీలోని ఫాక్షనిస్టులను బయటకు పంపించేస్తే అప్పుడు ప్రజల ఒత్తిడికి కాంగ్రెస్ కూడా అదే పని చేయకతప్పదు. దానితో సమస్య సగం పరిష్కారం అవుతుంది. మిగిలిన సగానికి ప్రభుత్వం చేయగలిగిందేమీలేదు. అది రాయలసీమ సామాజిక జీవిత సంస్కరణ ద్వారా జరగగలదు.

అడగవలసిన అన్ని ప్రశ్నలూ నిజాయితీగా అడిగినట్టయితే ఈ జవాబు సామాన్య ప్రజలే చెప్పగలరు. ఈ నిజాయితీ లేని 'శాంతి –సామరస్యాల' ప్రచారం ఎందుకు ?